సాక్షి
సిద్దిపేట

బుధవారం । 21 । జూన్ । 2023



యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

శారీరక, మానసిక ఆందోళనను తగ్గించేం దుకు, ఆరోగ్యం అందించేందుకు యోగా అవసరం. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' కథనం. 8లో..



సర్కార్ బడుల్లో సకల వసతులు

మన ఊరు-మన బడితో ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా సౌకర్యాలు కల్పించామని ఎమ్మెల్సీ యాదవరెడ్డి అన్నారు. 9లో..

దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేటకమాన్: జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 47 మంది ఆశ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తు న్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కాశీ నాథ్ తెలిపారు. 25 నుంచి 45 ఏళ్లలోపు వయసు ఉండి, పదో తరగతి విద్యార్హత కలిగి ఉం డాలన్నారు. ఇంటర్మీడియట్ అర్హత ఉన్న మహిళ లకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ నెల 26వ తేదీలోగా పీహెచ్‌సీలో దరఖాస్తు చేసుకోవాలని, 28న నియామకం ఉంటుందన్నారు.

న్యూస్‌రీల్

ఆరో రోజు 415 మంది



పర్యవేక్షిస్తున్న అడిషనల్ డీసీపీ మహేందర్

సిద్దిపేటకమాన్: పోలీస్ ఉద్యోగాలకు అర్హత సాధించిన అభ్యర్థులకు పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలన మంగళ వారం కొనసాగింది. అడిషనల్ డీసీపీ మహేం దర్ ఆధ్వర్యంలో 415 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. కార్యక్రమం లో పోలీస్ కమిషనర్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): సర్కారు విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అల్లాపూర్ పాఠశాల విద్యార్థులకు దుస్తులు, నోట్ బుక్స్ పంపిణీ చేసి, లైబ్రరీని ప్రారంభించారు. మన ఊరు మన బడితో పాఠశాలల రూపు రేఖలు మారాయని, విశాలమైన తరగతి గదులు, క్రీడా మైదానాలు, మధ్యాహ్న భోజనం, అను భవం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఉపాధ్య క్షుడు పాపయ్య, ఎంఈఓ దేశిరెడ్డి, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

అటవీ కళాశాలలో దశాబ్ది ఉత్సవాలు



విద్యార్థులతో కళాశాల అధ్యాపకులు

ములుగు(గజ్వేల్): ములుగు అటవీ కళాశాల, పరిశోధన సంస్థ (ఎఫ్‌సీఆర్ఐ)లో మంగళ వారం దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహిం చారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను తెలియజేసేలా కళాశాలలో విద్యా ర్థులు రంగురంగులతో ముగ్గులు వేశారు. కళా శాల అధ్యాపకులు ఫారెస్ట్ రీసెర్చ్ సెంటర్‌లో పని చేసే శ్రామికుల పిల్లలకు పుస్తకాలు, పెన్నులు, పలకలు, స్టేషనరీ ఉచితంగా పం పిణీ చేశారు. కార్యక్రమంలో బోధనేతర సిబ్బం ది తదితరులు పాల్గొన్నారు.

చట్టాలను కఠినంగా అమలు చేయాలి

సిద్దిపేటరూరల్: గోహత్య నిషేధ చట్టాన్ని కఠి నంగా అమలు చేయాలని విశ్వహిందూ పరి షత్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళ వారం కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం అందిం చారు. అనంతరం మాట్లాడుతూ పాడి పరి శ్రమ, వ్యవసాయానికి వెన్నెముకగా ఉన్న పశువులను హత్య చేయడం సరికాదన్నారు. ప్రతీ ఏడాది బక్రీద్ సందర్భంగా రాష్ట్రంలో విచ్చలవిడిగా గోహత్యలు జరుగుతున్నాయని, వీటిని నిలువరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫ లమైందని ఆరోపించారు. జిల్లాలో అక్రమంగా గోవులను వధించకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో మెదక్ విభాగ్ సహ కార్యదర్శి గ్యాదరి రాజారాం, జిల్లా సహ కార్యదర్శి బుస్సా నరేష్, బజరంగ్‌దల్ జిల్లా సంయోజక్ ఎక్కాల దేవి శ్రీనివాస్, నగర కార్యదర్శి బోనాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో సమస్యలు పరిష్కరించాలి

సిద్దిపేటకమాన్: ఐసీడీఎస్‌కు అందించే బడ్జె ట్‌లో కేంద్ర ప్రభుత్వం వాటాను పెంచి, అం గన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని అంగ న్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరిం చాలని చేపట్టిన జీపుజాత మంగళవారం సిద్దిపే టకు చేరుకుంది. ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ లకు కనీస వేతనం రూ.26 వేలు, టీఏ, డీఏ అందించాలని కోరారు. అంగన్‌వాడీ యూని యన్ రాష్ట్ర కోశాధికారి సునీత, లక్ష్మి, సీఐ టీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి, దాసరి కళావతి, నాయకులు రవికుమార్, అనిత, మాధవి, మల్లేశ్వరి, భూలక్ష్మి, మంజుల, బాల్ లక్ష్మి, కవిత, విజయ పాల్గొన్నారు.

పొంగుతున్న పొరుగు మద్యం

- సిద్దిపేటలో గోవా మద్యం బాటిళ్లు
- రూ.15లక్షల సరుకు స్వాధీనం
- కనబడని టాస్క్‌ఫోర్స్ తనిఖీలు



గోవా మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు (ఫైల్)

సాక్షి, సిద్దిపేట: జిల్లాలో పొరుగు రాష్ట్రాల మద్యం పొంగుతోంది. నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం పెద్దఎ త్తున వస్తుండడంతో రాష్ట్ర ఖజానాకు నష్టం వాటిల్లు తోంది. మారుమూల గ్రామాలను అడ్డా చేసుకొని బెల్ట్‌షాపుల ద్వారా పొరుగు రాష్ట్రాల మద్యాన్ని విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఎక్సైజ్ శాఖ అధికా రులు అడపాదడపా దాడులు నిర్వహిస్తున్నా మద్యం సరఫరా మాత్రం ఆగడంలేదు. ఇటీవల సిద్దిపేటలో గోవాకు చెందిన 286 మద్యం బాటిళ్లు, దుబ్బాకలో 44 బాటిళ్లను మల్కాజ్‌గిరికి చెందిన ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

అక్రమంగా విక్రయాలు

- అక్రమంగా ఇతర రాష్ట్రాల నుంచి తరలిస్తున్న మద్యంపై ఎక్సైజ్ అధికారులు దృష్టి సారించి మల్కాజ్‌గిరిలో ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా ఈ ముఠా గుట్టురట్టయ్యింది.
- ఈ నెల 13న సిద్దిపేటలో హరికృష్ణ ఇంట్లో నిల్వ చేసిన గోవాకు చెందిన మద్యం బాటిళ్లను ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు.
- ఈ దాడిలో రూ.15లక్షల విలువ చేసే 286 మద్యం బాటిళ్లు, 572 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు.
- కాగా ఓ ఇంట్లో అక్రమంగా పెద్ద మొత్తంలో మద్యం నిల్వ ఉన్నా.. అధికారులు గుర్తించలేదు.
- గోవా, కర్ణాటకల నుంచి అక్రమంగా సరఫరా అవుతుండడంతో జిల్లాలో మద్యం అమ్మకాలపై ప్రభావం పడుతోంది.
- డిసెంబర్ 2021 నుంచి మే 2022 వరకు 5,64,481 పెట్టెలు, డిసెంబర్ 2022 నుంచి మే 2023 వరకు 5,16,475 పెట్టెల మద్యం అమ్మకాలు జరిగాయి.
- 2021తో పోలిస్తే 2022లో 48వేల పెట్టెల మద్యం విక్రయాలు తగ్గాయి.
- పొరుగు రాష్ట్రాల మద్యం సరఫరాను కట్టడి చేయకపోతే రాష్ట్ర ఆదాయానికి గండిపడే ప్రమాదం తప్పదు.
- గతంలో ఎక్సైజ్ శాఖలో కీలకంగా పనిచేసిన టాస్క్‌ఫోర్స్ బృందాలు ఈ మధ్యకాలంలో ఉనికి లేకుండాపోయింది.
- పొరుగు, కల్తీ మద్యం విషయంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు, ఆయా ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లు ఎప్ప టికప్పుడు నిఘా పెట్టి దాడులు నిర్వహించేవారు.
- టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ అధికారులు తనిఖీలు తగ్గ డంతో నిర్వాహకులు లోకల్ మద్యం బాటిళ్లపై ఎమ్మార్పీకి మించి విక్రయాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.
- పొరుగు మద్యంతో పాటు కల్తీ మద్యం, గం జాయి, మత్తు పదార్థాల కట్టడికి ఎక్సైజ్ శాఖ టాస్క్‌ఫోర్స్‌ను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది.

> **కేసులు నమోదు చేస్తాం**
>
> ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యం ఒక్క బాటిల్ ఉన్నా చట్ట ప్రకారం నేరం. ఇతర రాష్ట్రాల నుంచి తరలించేందుకు వినియో గించిన వాహనాన్ని సైతం సీజ్ చేస్తాం. అక్ర మంగా మద్యం స్టాక్ ఉన్నట్లు తెలిస్తే కేసులు నమోదు చేస్తాం.
>
> – శ్రీనివాస మూర్తి, ఎక్సైజ్, సూపరింటెండెంట్



భూమిపూజ చేస్తున్న మంత్రి హరీశ్‌రావు, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ రోజా శర్మ, తదితరులు

అన్ని వసతులతో జిల్లా జైలు

- ఏడాదిలో అందుబాటులోకి..
- ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటఅర్బన్: ఆధునిక వసతులు, సౌకర్యా లతో నిర్మించనున్న జిల్లా జైలు ఏడాదిలో అం దుబాటులోకి తెస్తామని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి పరిధిలో 34 ఎక రాల్లో రూ.78 కోట్లతో నిర్మించనున్న జిల్లా జైలు భవనానికి మంగళవారం భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 33 జిల్లాల ఏర్పాటు తర్వాత సిద్దిపేటలో తొలి జిల్లా జైలు నిర్మాణమవుతుందన్నారు. గతంలోనే 58 పోస్టు లను మంజూరు చేశామని, ఖైదీలలో పరివర్తన వచ్చేలా వారికి వివిధ పనులు నేర్పించి, బయ టకు వచ్చాక ఉపాధి పొందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఖైదీల సంక్షేమం విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సిద్దిపేట సబ్ జైలు స్థలాన్ని మున్సి పల్, ఆర్డీఓ కార్యాలయాల అవసరాలకు ఉప యోగిస్తామన్నారు. జిల్లా జైలులో సుమారు 425 మంది ఖైదీలకు అవసరమైన వసతులు, బ్యారక్‌లతో ఓపెన్, ఇండోర్ జైలుగా నిర్మిస్తు న్నట్టు తెలిపారు. ఇప్పటికే ఎన్సాన్‌పల్లిలో మెడి కల్ కళాశాల, సెంట్రల్ డ్రగ్ స్టోర్, కేంద్రియ విద్యాలయం వచ్చాయని దీంతో ఎన్సాన్‌పల్లి జూబ్లిహిల్స్, బంజారాహిల్స్‌లా మారిపోయిం దన్నారు. కార్యక్రమంలో జైళ్ల శాఖ అడిషనల్ డీజీ జితేందర్, ఐజీ రాజేష్, డీఐజీ మురళీకృష్ణ, సీపీ శ్వేత, సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దామోదర్, జెడ్పీ చైర్‌పర్సన్ రోజా శర్మ, సర్పంచ్ రవీందర్ గౌడ్, వైస్ ఎంపీపీ ఎల్లం, ఎంపీటీసీ స్రవంతి తదిత రులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

ఆధునిక హంగులతో టూటౌన్ పీఎస్

సిద్దిపేటకమాన్: సిద్దిపేటలో ఆధునిక హం గులు, సౌకర్యాలతో టూటౌన్ పోలీసు స్టేషన్ నూతన భవనం త్వరలో అందుబాటులోకి వస్తుందని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం సీపీ శ్వేత, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మతో నూతన భవన పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రూ.4.40కోట్లతో 10,700 చదరపు అడుగుల విస్తీర్ణంలో రెండు అంతస్తుల్లో భవనం నిర్మాణమవుతుంద న్నారు. అన్ని వసతులతో ఇన్‌స్పెక్టర్ చాంబర్, ఎస్‌ఐలు, రిసెప్షనిస్ట్, రికార్డు గది, రైటర్ రూం , జిమ్, డైనింగ్ హాల్, ఉమెన్ రెస్ట్ రూం ఉంటా యన్నారు. పనులు త్వరగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ మచ్చ వనిత, మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, కౌన్సిలర్లు బర్ల మల్లిఖార్జు న్, బందారం శ్రీలత, నాయిని చంద్రం, ఏసీపీ దేవారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ ఫణిందర్, టూటౌన్ సీఐ రవికుమార్, ఎస్‌ఐలు భాస్కర్, విజ య్‌భాస్కర్, జ్యోతి, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, రవిరాజ్, చిత్రయాదవ్ పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

విద్యావ్యవస్థ బలోపేతానికి కృషి



విద్యార్థికి ట్యాబ్ అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు

- ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు
- ఉత్తమ విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేత

సిద్దిపేటకమాన్: రిజర్వాయర్ల ఖిల్లా, ఆలయాల జిల్లాతో పాటు సిద్దిపేట జిల్లా విద్యాలయాలకు నిలయంగా మారిందని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మం త్రి హరీశ్‌రావు అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగం గా మంగళవారం సిద్దిపేట పోలీసు కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ర్యాంకులు రావడంత గొప్ప విషయం అన్నారు. జిల్లాలో 219 స్కూళ్ళు వంద శాతం ఉత్తీ ర్ణత సాధించడంతో పాటు జిల్లాను రాష్ట్రంలో ద్వి తీయ స్థానంలో నిలపడంపై హర్షం వ్యక్తం చేశారు. పది జీపీఏ సాధించిన 126 మంది విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ స్కిల్స్, కాంటెంట్‌తో కూడిన ఐప్యాడ్స్‌ను అందించారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించిన ఒక్కో పాఠశాలకు రూ.25వేల చొప్పున రూ.55 లక్షలు పురస్కారం అందించారు. 100 శాతం రిజల్ట్స్ ఇచ్చిన 8 మండలాలకు ఒక్కో మండలానికి రూ.50వేల చొప్పున నగదు పురస్కారం అందిం చారు. సిద్దిపేట స్వచ్ఛ బడిని ఆదర్శంగా తీసుకొని 33 జిల్లాల్లో దీనిని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తా మన్నారు. మన ఊరు మన బడి కింద రూ.41కోట్లు ఖర్చు చేశామని, సీఎం కేసీఆర్ చదివిన పాఠశాలను రూ.10కోట్లతో తీర్చిదిద్దామన్నారు.

విద్యార్థితో మాటామంతి..

మిరుదొడ్డి మండలం పోతిరెడ్డిపేట జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని శ్రావ్యను భవిష్యత్‌లో ఏం అవుదామ నుకుంటున్నావు అని అడగగా.. కలెక్టర్ అవుతానని చెప్పడంతో అక్కడ ఉన్నవారంతా చప్పట్లతో అభి నందనలు తెలిపారు. మీరు రాసిన ఉత్తరం, తల్లి దండ్రులతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌తో ఇం టికి వచ్చాక మా నాన్న టీవీ ఆఫ్ చేసి చదువు పై ధ్యాస పెట్టాలని సూచించడంతో 10జీపీఏ వచ్చిం దని శ్రావ్య మంత్రికి తెలిపింది. పాఠశాలలో నీకు ఏ టీచర్ అంటే ఇష్టం అని అడగగా.. అందరూ టీచర్లు ఇష్టమేనని సమాధానం ఇవ్వడంతో అక్కడ ఉన్నవా రంతా చిరునవ్వులు చిందించారు. చాలా సమయ స్ఫూర్తి ఉంది, నీవు తప్పకుండా కలెక్టర్ అవుతావు.. భవిష్యత్‌లో ఎలాంటి అవసరం ఉన్నా నన్ను కల వవచ్చు.. అని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమం లో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, అడిషనల్ కలె క్టర్ ముజామ్మిల్ ఖాన్, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల, సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మచ్చ విజిత, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

తగ్గని రద్దీ

సిద్దిపేటజోన్: ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తుదారులు మంగ ళవారం అర్బన్ తహసీల్దార్ కార్యాలయం వద్ద క్యూ కట్టారు. పెద్ద ఎత్తున దరఖా స్తులు రావడం, రెండు రోజుల పాటు సర్వర్ డౌన్‌తో రద్దీ ఏర్పడింది. దీంతో సర్టిఫికెట్ల కోసం కార్యాలయం వద్ద ఎదు రుచూపులు తప్పలేదు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరీక్షిస్తున్న దరఖాస్తుదారులు

171 అర్చక పోస్టులు మంజూరు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్ర దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన దూపదీపనైవేద్య కార్య క్రమంలో భాగంగా 171 మంది అర్చక పోస్టులు మం జూరైనట్లు దేవాదాయ సహాయక కమిషనర్ శివరాజ్ తెలిపారు. బుధవారం ఉదయం పట్టణంలోని శ్రీవేం కటేశ్వర ఆలయంలో ఉదయం 8గంటలకు ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా మంజూరు పత్రాలను అందిచనున్నట్లు తెలిపారు.

ఆయిల్‌పాం సాగుపై ఆసక్తి చూపాలి

- జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారిణి సునిత

మిరుదొడ్డి(దుబ్బాక): దీర్ఘకాలిక లాభాలు వచ్చే ఆయిల్‌పాం సాగుపై రైతులు ఆసక్తి చూపాలని జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారిణి సునీత కోరారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలం రుద్రారం రైతువేదికలో మంగళవారం రైతులకు ఆయిల్‌పాం సాగుపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిం చే సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్థికంగా స్థిరపడటానికి ఆయిల్‌పాం సాగు చేయాల న్నారు. ఆయిల్‌పాం మార్కెటింగ్‌కు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో హార్టీ కల్చర్ ఆఫీసర్ బాలాజీ, ఏఈఓ సాయికుమార్, ఆయిల్‌ఫెడ్ కంపెనీ ప్రతినిధి ప్రవీణ్, పీఏసీఎస్ డైరెక్టర్ పాలమాకుల రమేష్, రైతులు మల్లన్నగారి భిక్షపతి పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారిణి సునీత

ప్రతీ రక్తపు బొట్టు ప్రజల కోసమే

- ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు
- సిద్దిపేటలో పలు అభివృద్ధి పనుల ప్రారంభం



సిద్దిపేటరూరల్: డబుల్‌లేన్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటరూరల్: నా ప్రతీ రక్తపు బొట్టు ప్రజల సం క్షేమం కోసమే, వారి అవసరాలను తెలుసుకుని పరిష్కరించేందుకు నిత్యం కృషిచేస్తానని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మం గళవారం మండలంలోని పుల్లూరు గ్రామంలో రూ.9 కోట్లతో చేపట్టిన రోడ్ల పనులకు శంకుస్థా పన, అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్య క్రమంలో పాల్గొని మొక్క నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం 70 ఏళ్లలో చేసిందేమీ లేదని, రైతులు, ప్రజలు సాగు, తాగునీరుకు ఎన్నో ఇబ్బందులు పడ్డారని అన్నారు. నేటికి మహారాష్ట్రలో ప్రజలకు అందించే తాగునీటిలో కోత విధించి మూడు రోజు లకు ఒకసారి అందిస్తున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ కృషితోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథ కాలు అమలవుతున్నాయని, కాళేశ్వరంతో చెరువులు నిండి, మత్తడులు దూకుతున్నాయ న్నారు. త్వరలో రంగనాయక సాగర్‌ను నిండుకుం డలా మార్చి రైతులకు సాగునీరు అందిస్తామ న్నారు. పల్లె దవాఖానా సేవలను ప్రజలకు మరిం త చేరువ చేయాలని వైద్యాధికారులకు సూచిం చారు. తన పనితనం చూసి ఆదరించాలని కోరగా.. ఓ వ్యక్తి లక్ష మెజారిటీ ఇస్తామని గట్టిగా అరిచాడు. మంత్రి మాట్లాడుతూ.. లక్షకాదు, లక్షా 50వేల మెజారిటీ అందించాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 6.8 శాతం ఉన్న పచ్చదనం హరితహారంతో నేడు 14 శాతానికి పెరిగింద న్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీదేవి, జెడ్పీ టీసీ శ్రీహరిగౌడ్, వైస్ ఎంపీపీ యాదయ్య, సర్పం చ్‌లు నరేశ్, వీణా, డీఎఫ్ఓ శ్రీనివాస్‌లు, ఉపసర్పం చ్ ప్రసాద్‌రెడ్డి, అటవి శాఖ అధికారులు లింగమూ ర్తి, ఎంపీటీసీ లత, తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందిస్తాం..

నంగునూరు(సిద్దిపేట): రైతులు వానల కోసం ఎదురు చూడొద్దని ప్రాజెక్టుల నుంచి సాగునీటిని అం దిస్తామని మంత్రి హరీశ్‌రావు రైతులకు సూచిం చారు. కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ తో కలిసి మం గళారం అప్పలాయిచెర్వు గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. రూ. 2.29కోట్లతో మగ్దుంపూర్ నుంచి వెంకటాపూర్ వరకు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ, రెడ్డి సంఘం, ముదిరాజ్ సంఘ భవనం, పంచాయతీ, మహిళా భవనం, ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లవ్వ, గట్లు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ బాబు, మహిపాల్‌రెడ్డి, సాయిరెడ్డి, జయపాల్‌రెడ్డి, మహేశ్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండ

సిద్దిపేటజోన్: బీసీ కులవృత్తిదారులకు ఆర్థిక చేయూత అందించేందుకు ప్రభుత్వం అందిస్తున్న రూ.లక్ష సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం క్యాం పు కార్యాలయంలో 66 మంది బీసీ కులవృత్తి లబ్ధి దారులకు రూ.లక్ష సబ్సిడీ ఆర్థిక సాయం చెక్కు లను అందించారు. స్వయం ఉపాధి నిమిత్తం 49మంది దివ్యాంగులకు మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడు తూ.. సిద్దిపేటలో 101 మంది దివ్యాంగులకు ఉచి తంగా స్కూటీలు పంపిణీ చేశామని, జీవనోపాధి కోసం రూ.50 వేల చొప్పున రుణ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మహారాష్ట్రలో దివ్యాంగులకు రూ.900 నుంచి రూ.1200, కర్ణాటకలో రూ.1000 నుంచి రూ.1,200 మాత్రమే పింఛన్ ఇస్తున్నారని, తెలంగాణలో రూ.3,016 అందిస్తున్నామని అన్నారు. ఇటీవలే సీఎం కేసీఆర్ ప్రకటించిన వేయి రూపాయలతో రూ.4,016కు చేరింద న్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీనెలా 4.50లక్షల పైచి లుకు దివ్యాంగులకు పింఛన్ అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం నంగనూర్ మండల పరిధిలో కుల సంఘాల భవనాలకు రూ.10 లక్షల చొప్పున ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు.



సిద్దిపేటజోన్: దివ్యాంగురాలికి చెక్కు అందిస్తున్న మంత్రి హరీశ్‌రావు

క్లుప్తంగా

వడదెబ్బతో మతిస్థిమితం లేని మహిళ మృతి

నర్సాపూర్: వడదెబ్బతో మతిస్థిమితం లేని మహిళ మృతిచెందింది. ఎస్‌ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం..నర్సాపూర్‌లోని చైతన్యపురి కాలనీకి చెందిన సంకు లక్ష్మి (45)కి కొన్ని రోజుల నుంచి మతిస్థిమితం సరిగా లేదు. ఆమె ఏ పనీ చేయకుండా భిక్షాటన చేస్తుండేది. వారం రోజుల నుంచి తన ఆరోగ్యం విషయమై తనలో తాను బాధపడుతుండేది. కాగా మంగళవారం మధ్యాహ్నం మండలంలోని కొండాపూర్ బస్టాప్ సమీపంలో ఓ మహిళ మృతదేహం ఉందని ఆమె సోదరుడు ఆంజనేయులుకి సమాచారం అందడంతో అక్కడికి వెళ్లి చూశాడు. తన అక్క సంకు లక్ష్మిగా గుర్తించాడు. వెంటనే ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం సేవించిన వ్యక్తికి జైలు

తూప్రాన్: మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి మెదక్ మొబైల్ కోర్టు న్యాయమూర్తి మంగళవారం ఒకరోజు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ సురేశ్‌కుమార్ పేర్కొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఈ ఏడాది మార్చి 19న పట్టణంలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించగా శివరాత్రి యాకయ్య మద్యం తాగి వాహనాన్ని నడుపుతూ పట్టుబడినట్లు ఎస్‌ఐ తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసుకొని చార్జిషీట్‌ను స్పెషల్ మొబైల్‌కోర్టు మెదక్‌లో సమర్పించారు. న్యాయమూర్తి కల్పనా విచారణ తర్వాత ఒకరోజు జైలు శిక్షను విధించినట్లు తెలిపారు.

బార్ అండ్ రెస్టారెంట్‌పై కేసు నమోదు



తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

హుస్నాబాద్: కల్తీ మద్యం విక్రయిస్తున్నారని పట్టణంలోని జగదాంబ బార్ అండ్ రెస్టారెంట్‌పై కేసు నమోదు చేసినట్లు హుస్నాబాద్ ఎక్సైజ్ ఎస్‌ఐ దామోదర్ తెలిపారు. పట్టణంలోని బార్ అండ్ రెస్టారెంట్లలో ఇద్దరు ఎస్‌ఐలు సిబ్బందితో సోమవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో జగదాంబ బార్ అండ్ రెస్టారెంట్‌లో రాయల్ స్టాగ్ బ్లెండెడ్ విస్కీ (1000 ఎంఎల్) మద్యం బాటిల్లో వాటర్ లెవల్స్ ఎక్కువగా ఉన్నట్లు హైడ్రో మీటర్ పరీక్షల ద్వారా ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు తెలిపారు. డైల్యూషన్ ఉన్న 6 బాటిళ్లను సీజ్ చేసి రసాయనాల పరీక్షల నిమిత్తం నిజామాబాద్ రసాయన ప్రయోగశాలకు పంపినట్లు తెలిపారు. బార్ అండ్ రెస్టారెంట్ నౌకర్ నామ భాస్కర్ పై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. పూర్తి స్థాయి రిపోర్టు వచ్చిన తర్వాత ఉన్నతాధికారుల ఆదేశం మేరకు తగుచర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ దామోదర్ తెలిపారు.

లారీ.. బైక్ ఢీ: ఒకరికి గాయాలు

వర్గల్(గజ్వేల్): బైక్ మీద వెళ్తున్న వ్యక్తిని లారీ ఢీకొనడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. ఈ ఘటన మంగళవారం వర్గల్ మండలం గౌరారం రూరల్ సర్కిల్ కార్యాలయ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మైలారం గ్రామానికి చెందిన బూరుగుపల్లి రాములు(40) తన బైక్ మీద గౌరారం నుంచి మైలారం వెళ్తున్నాడు. రూరల్ సర్కిల్ కార్యాలయ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ, బైక్‌ను ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ఘటనలో బైకిస్టు రాములు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే గౌరారం పోలీసులు 108 అంబులెన్స్‌లో లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆసుపత్రికి తరలించారు.

వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో కేసు నమోదు

చేగుంట(తూప్రాన్): పొలం దున్నుకోవడానికి వెళ్లిన వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు ఎస్ ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపారు. మాసాయిపేట మండలం బొమ్మారం గ్రామంలో సిద్ధిరాములు తన పొలం దున్నుకోవడానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన మట్టెల మల్లేశం, మట్టెల శంకర్‌లు తమ పొలంనుంచి ట్రాక్టర్ ఎందుకు తీసుకెళ్లావని సిద్ధిరాములుపై దాడి చేశారు. దీంతో అతని తలకు గాయాలయ్యాయి. తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్న సిద్ధిరాములు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ
- రాణిస్తున్న సిద్దిపేట వాసులు
- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం



యోగా చేస్తున్న చిన్నారులు



గీతా స్కూల్లో 'యోగా డే' ఆకృతిలో విద్యార్థులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): శారీరక, మానసిక ఆందోళనలను తగ్గిస్తు, సంపూర్ణ ఆరోగ్యం కల్గిస్తు నిత్య నూతనోత్సవాన్ని అందించేది యోగా. ప్రతి రోజు యోగా, ద్యానం చేస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పెద్దలు చెబుతారు. భారతదేశంలో పూరాతన కాలం నుంచి యోగా అభ్యసనలు చేస్తున్నారు. ప్రపంచానికి యోగాను పరిచయం చేసింది భారతదేశమే. జూన్ 21ని పురస్కరించుకొని ప్రపంచ యోగా దినోత్సవంగా నిర్వహించుకుంటున్నారు. బుధవారం ఉదయం 6గంటల నుంచి 7గంటల వరకు సిద్దిపేట పట్టణంలోని మిని క్రికెట్ స్టేడియంలో 9వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సాముహిక యోగా సాధన నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు హాజరుకానున్నారు. సిద్దిపేట జిల్లా నేడు యోగాలో జాతీయ స్థాయిలో గుర్తింపును పొందింది. అనేక మంది రాష్ట్ర, జాతీయ, యోగా పోటీల్లో రాణించడంతో పాటుగా, అనేక మందికి యోగాను నేర్పుతున్నారు. ఆన్‌లైన్ ద్వారా అంతర్జాతీయంగా యోగాను నేర్పుతున్నారు. జిల్లాలోని వ్యాసమహర్షి యోగా సొసైటీ, సిద్దిపేట యోగా స్పోర్ట్స్ అసోసియేషన్, పతంజలి యోగా అసోసియేషన్, తదితర సంస్థల ఆధ్వర్యంలో నిత్యం యోగా శిక్షణ ఇస్తున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ యోగా శిక్షకులు తోట సతీశ్ స్వయంగా రాష్ట్ర, జాతీయ స్థాయి యోగా పోటీల్లో రాణిస్తూ, అనేక మందికి యోగాలో శిక్షణ ఇస్తున్నారు. వ్యాస మహర్షి యోగా సొసైటీ, సిద్దిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో ప్రతీ రోజు ఉచిత యోగా శిక్షణలు ఇస్తున్నారు.

ఉచిత యోగా శిబిరాలు

సందర్భాన్ని బట్టి ఉచిత యోగా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. బాలసదనం, అభయజ్యోతి, నర్సింగ్ కళాశాల, మంత్రి క్యాంప్ కార్యాలయం, ఎన్‌జీవోస్ కాలనీ, సిటిజన్ క్లబ్, కోమటి చెరువు, వ్యాసమహర్షి సొసైటీలో, పాఠశాలల్లో, తదితర చోట్ల ఉచితంగా యోగా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపుగా 50వేల మందికి యోగాలో శిక్షణ ఇవ్వగా, అదేవిధంగా 500 మందిని యోగా శిక్షకులుగా శిక్షణ అందించారు. వయస్సు పైబడిన వారికి అనుకూలంగా రిథమిక్, పవర్, స్టిక్, రూప్ యోగాలు నేర్పిస్తున్నారు.

కరోన సమయంలో

కరోనా సమయంలో ఆన్‌లైన్ ద్వారా యోగా శిక్షణ అందించారు. ముఖ్యంగా వృద్ధులకు, మహిళలకు, చిన్నారులకు ఎంతో ఉపయోగపడింది. మానసిక ఆందోళన తొలగించడానికి, ప్రశాంతత నెలకొనే విధంగా తర్ఫీదు ఇచ్చారు.

సిద్దిపేట నుంచి

సిద్దిపేటలో మొదట యోగా శిక్షణ అనంతరం అంతర్జాతీయ స్థాయిలో ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా యోగా శిక్షణ అందిస్తున్నారు. యూట్యూబ్ ద్వారా కూడా యోగా కార్యక్రమాలను చూపిస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా 24 వారాల పాటుగా విదేశాలకు చెందిన 500 మందికి పైగా యోగాలో శిక్షణ ఇస్తున్నారు. అమెరికా, ఐర్లాండ్, ఇంగ్లాండ్, ఆస్ట్రేలియా తదితర దేశాలకు చెందిన వారు ఈ ఆన్‌లైన్‌లో శిక్షణ పొందుతున్నారు.

సర్వరోగ నివారిణి

సర్వరోగ నివారిణిగా యోగా ఉపయోగపడుతుందన్నారు. యోగా హెల్త్ డ్రైవ్ పేరిట ఆస్తమా, డయాబెటిస్, తదితర వ్యాధులకు అక్యుపంచర్, మడ్‌బాత్(మట్టిస్నానం)లతో యోగా చికిత్స నిర్వహిస్తున్నారు. ఆరోగ్య సిద్దిపేటలో భాగంగా వ్యాస మహర్షి సొసైటీ జిల్లా అధ్యక్షుడు తోట అశోక్ ఆధ్వర్యంలో మంత్రి హరీశ్‌రావు క్యాంప్ కార్యాలయంలో అన్ని వయస్సుల వారికి యోగా శిక్షణ ఇస్తున్నారు.

చిన్నారులకు, మహిళలకు శిక్షణ

చిన్నారులకు, మహిళలకు ఇంటి వద్దే ఏర్పాటు చేసిన యోగా శిక్షణ శిబిరంలో ప్రతీ రోజు ఉదయం 6గంటల నుంచి 7గంటల వరకు, సాయంత్రం 7.30గంటల నుంచి, రాత్రి 9గంటల వరకు తన భార్య తోట సంధ్య సహకారంతో ప్రత్యేక యోగా శిక్షణ అందిస్తున్నారు. బాలసంస్కార్ పేరిట నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమంలో యోగాతో పాటుగా డ్రాయింగ్, చేతిరాత, భాషలపై పట్టు, ప్రాచీన సంస్కృతి, సాంప్రదాయాలపై అవగాహన, భగవద్గీత, రామాయణంపై అవగాహన తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నారు.

మానసిక ఆరోగ్యం పెరుగుతుంది



యోగాను మన పూర్వీకులు ప్రపంచానికి అందించిన గొప్ప సంపద. ప్రతీ రోజు యోగా చేసిన వారికి మానసిక, శారీరక ఆరోగ్యం లభిస్తుంది. యోగాలో రాష్ట్ర స్థాయి, జాతీయ బహుమతులు గెల్చుకున్నాను. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగాను క్రీడల జాబితాలో చేర్చినందున, దానికి మంచి పేరు వచ్చింది.

–సతీశ్, యోగా శిక్షకులు, సిద్దిపేట

అందరూ చేయొచ్చు



యోగాను అందరూ చేయొచ్చు. దీనికి వయస్సు, లింగత్వం ఉండదు. అన్ని వయస్సుల వారు, స్త్రీలు, పురుషులు అందరూ చేయొచ్చు. ముఖ్యంగా బాలికలు, యువతులు, మహిళలకు ఈ యోగాతో అనేక శారీరక సమస్యలు నయం అవుతాయి. నిత్యం యోగా చేయడం ద్వారా డయబెటిస్, అధిక బరువు, నడుం నొప్పులు వంటివి దూరమవుతాయి.

–తోట సంధ్య, యోగా శిక్షకురాలు, సిద్దిపేట

తూప్రాన్‌లో..

తూప్రాన్: జూన్ 21 యోగా డే సందర్భంగా పట్టణంలోని గీతా స్కూల్లో ముందస్తు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులు 'యోగా డే' ఆకారంలో కూర్చుని యోగా విశిష్టతను తెలియజేశారు. కరస్పాండెంట్ పి.రామాంజనేయులు యోగా వల్ల కలిగే లాభాలను వివరించారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.

యోగాలో రాణిస్తున్న టేక్మాల్ పీఈటీ నర్సింలు

టేక్మాల్(మెదక్): ఆయనొక సాధారణ వ్యాయమ టీచర్. యోగాలో తనదైనశైలిలో ఆసనాలు వేస్తూ అందరిని అబ్బుర పరచడంతో పాటూ, విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాడు. టేక్మాల్ మోడల్ స్కూల్‌లో పని చేస్తున్న పీఈటీ గజెంద్రుల నర్సింలు, యోగా మీద మక్కువతో తను పదోతరగతిలోనే కర్ణం గణేష్ రవికుమార్ వద్ద యోగ నేర్చుకొని రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో పాల్గొన్నాడు. భూమాసానం, హనుమానాసనం, పరివృత్త పార్శ్వసన, కుకుటాసన, హలాసనం, చక్రసానం, వీరభద్రాసన, నట్రాజాసన, వృచ్చికాసన, త్రివిక్రసాన, కూర్మాసన వంటి తదితర ఆసనాలను విద్యార్థులకు నిత్యం నేర్పుతున్నాడు. యోగాలో దిట్టగా నిలిచినా నర్సింలు గతంలో ఉత్తమ క్రీడాకారుడిగా మండల, జిల్లా స్థాయిలో బహుమతులు అందుకున్నారు.



వృచ్చికాసానం వేస్తున్న పీఈటీ నర్సింలు

బావల చేతిలో బావమరిది దారుణ హత్య



ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ

కొల్చారం(నర్సాపూర్): ఆస్తికోసం సొంత బావల చేతిలోనే బావమరిది హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన కొల్చారం మండలం అప్పాజీపల్లిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొంగోటి శేకులు (23) తండ్రి నర్సింలు మూడేళ్ల క్రితమే చనిపోయాడు. మృతుడికి ముగ్గురు అక్క చెల్లెలు. శేకులు పేరుపై గ్రామ సమీపంలో రెండు, ఏడుపాయల సమీపంలోని కురువగడ్డలో మరో రెండు ఎకరాల పొలం ఉంది. స్వ గ్రామంలో ఇటీవల రూ.20 లక్షలతో ఇల్లు నిర్మించాడు. కాగా శేకులు తల్లి పోచమ్మతో తరచూ గొడవపడుతుండేవాడు. దీంతో విసిగి పోయిన తల్లి కూతుళ్లకు ఈ విషయం చెప్పింది.

దీంతో అదే రోజు సాయంత్రం కూతుళ్లు తమ భర్తలను వెంటబెట్టుకొని అప్పాజీపల్లికి చేరుకున్నారు. అదే రోజు రాత్రి కుల సంఘం చిట్టి మీటింగ్ ఉండడంతో వారి వద్దకు వెళ్లిన పోచమ్మ తన గోడును వెల్లబోసుకుంది. దీంతో వారు శేకులును పిలిపించి మాట్లాడుతామని ఆమెకు సర్ది చెప్పారు. మరుసటి రోజు(మంగళవారం) తల్లి, కొడుకు మధ్య ఉన్న వైరాన్ని మాట్లాడేందుకు సంఘం పెద్దలు సమావేశమై తల్లి కొడుకును పిలిపించేందుకు ఇంటికి మనిషిని పంపించినట్లు తెలిపారు. అంతలోనే శేకులు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు అతని అక్క చెల్లెలు, బావలు ఏడుస్తుండడం గమనించిన వ్యక్తి సంఘం పెద్దలకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి వెళ్లిన గ్రామ పెద్దలు అక్కడికి వెళ్లి చూడగా ఆత్మహత్యకు సంబంధించి అనుమానం వ్యక్తం కావడంతో, వెంటనే కొల్చారం ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్‌కు సమాచారం అందజేశారు. మెదక్ డీఎస్పీ సైదులు, మెదక్ రూరల్ సీఐ విజయ్‌కి సమాచారం చేరవేసి క్లూస్ టీంను రప్పించినట్లు తెలిపారు. క్లూస్ టీం ఆధారాల కోసం వెతుకుతుండగా ఇంట్లోని ఓ మూలన డ్రమ్ములో రక్తపు మరకలతో కూడిన శేకులు ప్యాంటు, చొక్కా, రక్తపు మరకలతో కూడిన కర్రలు లభించినట్లు తెలిపారు. మృతుని తల్లి పోచమ్మ ద్వారా వివరాలు తెలుసుకున్న డీఎస్పీ కుటుంబ సభ్యులందరినీ అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. శేకులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియాసుపత్రికి తరలించి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టనున్నట్లు డీఎస్పీ తెలిపారు.

ఆస్తి కోసం హత్య..

శేకులు పేరుమీద భూమి, ఇల్లుకు సంబంధించి దాదాపు రూ.రెండు కోట్ల ఆస్తి ఉంటుందని, ఈ విషయంలోనే అతని అక్క చెల్లెల్లు తరచూ ఆస్తి విషయమై గొడవ పడేవారని చుట్టుపక్కల వాళ్లు తెలిపారు. ఆస్తి కోసమే అతని బావలు శేకులును కొట్టి చంపి ఆత్మహత్యగా చిత్రీకరించే యత్నం చేసినట్లు గ్రామస్తులు అనుమానాలను వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో పెరిగిన మత్స్య సంపద

రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్



దుబ్బాకలో కేసీఆర్ స్కూల్‌లో విద్యార్థులకు చేపల ఆహారం వడ్డిస్తున్న పిట్టల రవీందర్

దుబ్బాకటౌన్: రాష్ట్రంలో మత్స్యసంపద ఘననీయంగా పెరిగిందని రాష్ట్ర మత్స్యసహకార సంఘాల చైర్మన్ పిట్టల రవీందర్ అన్నారు. మంగళవారం మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా దుబ్బాక పట్టణంలోని సీఎం కేసీఆర్ స్కూల్‌లో ఆరోగ్య పరిరక్షణలో చేపల ఆహారం పాత్రపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మొట్టమొదటిసారిగా సీఎం కేసీఆర్ చదివిన పాఠశాలలో విద్యార్థులకు చేపలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో చేపల ఆహారాన్ని అందించడంపై ఆలోచన చేస్తున్నట్టు చెప్పారు. మాంసహారంలో అన్నింటిలో బాగా శక్తినిచ్చేది చేపల ఆహారమని ఇందులో కొవ్వు పదార్థం ఎంత మాత్రం ఉండదన్నారు. గుండెపోటు, బీపీ, షుగర్ లాంటి 18 రకాల రోగాలు దరి చేరకుండా చేపల ఆహారం ఉపయోగపడుతుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించిందన్నారు. చేపల పెంపకంతో మత్స్యకారులకు జీవనోపాధితో పాటు అనేక మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ప్రతి ఆదివారం చికెన్, మటన్‌కు బదులుగా చేపలు విరివిగా తినాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి, ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్‌రెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్, దుబ్బాక మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు గుండబోయిన వెంకటేశ్వర్, పెంటం రాంచంద్రం, హెచ్‌ఎం గాజుల రాంచంద్రం, ఏడీ మల్లేశం పాల్గొన్నారు.

దాడి చేసిన ఎనిమిది మంది రిమాండ్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): బాణామతి, చేతబడి చేశారంటూ చెట్టుకు వేలాడదీసి దాడి చేసిన ఘటనలో ఎనిమిది మంది నేరస్థులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సంగారెడ్డి డీఎస్పీ రవీంద్ర రెడ్డి తెలిపారు. ఘటనకు సంబంధించిన వివరాలను సీఐ నవీన్ కుమార్ వెల్లడించారు. చేతబడి నెపంతో దాయాదులు తమపై దాడి చేశారని ముత్తంగి అమృత భర్త యాదయ్య ఈ నెల 17న ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టగా కొల్కూరు గ్రామానికి చెందిన ఎనిమిది మంది దాయాదులు ముత్తంగి అమృత, వారి భర్త యాదయ్యతో పాటుగా ఫిర్యాదురాలి అక్క కోవూరి శ్యామమ్మపై దాడి చేసినట్లు తెలిసింది. విచారణ చేపట్టగా గ్రామానికి చెందిన కోహీర్ లక్ష్మణ్(ఏ1), గడ్డం పెంటయ్య(ఏ2), ముత్తంగి బాగయ్య(ఏ3), సర్గల్ల శివయ్య(ఏ4), కోవూరు శివకుమార్(ఏ5), బేగరి శివ కుమార్(ఏ6), గడ్డం శ్యామల(ఏ7), గడ్డం ఆగమ్మ (ఏ8) వారు చేసిన నేరాన్ని అంగీకరించారు. దీంతో సదాశివపేట పోలీసులు వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరుచగా వారికీ రిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు నాగలక్ష్మి, సుదర్శన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నేరస్తులను రిమాండ్‌కు తరలిస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రామాయంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో సుతారిపల్లికి చెందిన యువకుడు మృతి చెందాడు. గ్రామానికి చెందిన అరుణ్ (18) బైక్‌పై రామాయంపేటవైపు నుంచి సుతారిపల్లి వెలుతుండగా, ఎదురుగా అతివేగంగా వస్తున్న టాటా ఏసీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అరుణ్‌ను చికిత్స నిమిత్తం 108 అంబులెన్సులో రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందాడని వైద్యులు తెలిపారు. ఎస్‌ఐ రంజిత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న ముగ్గురు మృతి

ఆయా సంఘటనలో చికిత్స పొందుతున్న ముగ్గురు మృతి చెందారు.

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్‌కు చెందిన చాడ మల్లవ్వ(70) అనారోగ్యంతో బాధపడుతూ ఈ నెల 10న హుస్నాబాద్‌లోని కూతురు ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య యత్నానికి పాల్పడింది. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చిక్సిత నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చిక్సిత పొందుతూ మంగళవారం మృతి చెందింది. దీనిపై పోలీసులను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు తమకు అందలేదని ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి..

రాయపోలు(దుబ్బాక): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్‌ఐ మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం..ఆరెపల్లికి చెందిన దాతర్‌పల్లి మల్లేశం గత నెల 29న లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన సూర్ణ బిక్షపతి ద్విచక్రవాహనంపై ఆరెపల్లి నుంచి లింగారెడ్డిపల్లి వెళ్తుండగా..ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో మల్లేశం పరిస్థితి విషమంగా ఉండడంతో నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మొదటి అంతస్తు నుంచి కింద పడి..



మల్లేశం మృతదేహం

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ హెచ్.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం..సంగారెడ్డి నిజాంపేట్ మండలం నగ్దల్‌కు చెందిన కోకొండ రాజు(35) బతుకుదెరువు కోసం 15 సంవత్సరాల క్రితం వచ్చి, పటాన్‌చెరు పట్టణంలోని అంబేడ్కర్ కాలనీలో ఉంటూ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 16వ తేదీన తను నివాసం ఉండే మొదటి అంతస్తు నుంచి కిందికి దిగుతుండగా ప్రమాదవశాత్తు జారి పడటంతో తలకు గాయమైంది. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. తిరిగి అక్కడ నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాజు మంగళవారం మృతి చెందాడు. మృతుడి భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు సైబర్ నేరస్తుల అరెస్ట్

- అమ్మాయిల ఫొటోలు షేర్ చేస్తూ మొదట పరిచయం
- అత్యాధునిక టెక్నాలజీ సాయంతో గుర్తింపు : సీపీ శ్వేత



మాట్లాడుతున్న సీపీ శ్వేత, ఏసీపీ రమేశ్, తొగుట సీఐ కమలాకర్, ఎస్‌ఐ అరుణ్

సిద్దిపేటకమాన్: గుర్తు తెలియని వ్యక్తులకు ఆన్‌లైన్‌లో మొదట అమ్మాయిల ఫొటోలు షేర్ చేసి పరిచయం చేసుకుంటారు. అనంతరం అశ్లీల ఫొటోలు పంపించి బాధితులను బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తూ సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గజ్వేల్ ఏసీపీ రమేశ్‌తో కలిసి సీపీ శ్వేత వివరాలు వెల్లడించారు. జగిత్యాల పట్టణం కీళ్లగడ్డలో నివాసం ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న ఆరెపల్లి అభిషేక్ (24), కరీంనగర్ జిల్లా హుజురాబాద్ మండలం పెద్దపాపాయపల్లి గ్రామానికి చెందిన భాషవేన అభినాష్ (21) డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. వీరిరువురు సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో షేర్ చాట్‌లో అమ్మాయిల ప్రొఫైల్ ఫొటోలతో (డీపీ) ఫేక్ అకౌంట్ క్రియేట్ చేసుకునేవారు. తర్వాత స్పందించిన వ్యక్తుల వాట్సప్ నెంబర్‌కు న్యూడ్ వీడియోలు, అశ్లీల చిత్రాలు, ఫొటోలు పంపిస్తూ సైబర్ నేరస్థులు వారితో చాట్ చేసేవారు. అనంతరం వీరు చేసిన చాట్‌ను, అశ్లీల చిత్రాలను స్క్రీన్ షాట్ తీసి మొబైల్‌లో భద్రపరుచుకుంటారు. వీరు చాట్ చేసిన స్క్రీన్‌షాట్లను వేరే నెంబర్ నుంచి బాధితుల వాట్సప్ నెంబర్లకు పంపిస్తూ మేము గచ్చిబౌలి నుంచి సైబర్ క్రైం ఎస్‌ఐని మాట్లాడుతున్నానని చెబుతూ మీ అశ్లీల చిత్రాలు, చాట్ చేసిన స్క్రీన్ షాట్స్, ఇతర వివరాలు తమ వద్ద వచ్చాయని, దీనిపై తమకు ఫిర్యాదు అందిందని బాధితులను బెదిరిస్తూ వారి నుంచి రూ.10వేల నుంచి రూ.20వేల వరకు వారు సూచించిన బ్యాంకు ఖాతాకు పంపించుకునేవారు. ఈ క్రమంలో కమిషనరేట్ పరిధిలోని బేగంపేట పోలీస్ స్టేషన్‌లో కొద్ది రోజుల క్రితం నమోదైన సైబర్ నేరంపై పరిశోధనలో భాగంగా సీపీ శ్వేత ఆదేశానుసారం గజ్వేల్ ఏసీపీ రమేశ్ ఆధ్వర్యంలో తొగుట సీఐ కమలాకర్, బేగంపేట ఎస్‌ఐ అరుణ్, కానిస్టేబుళ్లు రాజు, అనిల్, రామచంద్రారెడ్డిలతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. విచారణలో భాగంగా బాధితుడి వద్ద నుంచి ఇద్దరు వ్యక్తులు కుకునూర్‌పల్లి బస్టాండ్ వద్ద డబ్బులు తీసుకున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు తొగుట సీఐ కమలాకర్, ఎస్‌ఐ అరుణ్ ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ విచారణలో వారు చేసిన తప్పును ఒప్పుకున్నారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే ధైర్యంగా పోలీసులకు లేదా 1930కు ఫిర్యాదు చేయాలని సీపీ సూచించారు.